# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక






RANGAREDDY, EDITION : 01, VOLUME :101 EDITOR:CHERUKU UPENDAR, DATE : TUESDAY 15 AUGUST 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 101 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : మంగళవారం 15 ఆగస్టు 2023 పేజీలు : 4 వెల : 5/-


## పంద్రాగస్టుకు
# ఎర్రకోట రెడీ



న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

దేశ రాజధాని ఢిల్లీ స్వాతంత్య్ర వేడుకలకు ముస్తాబవుతోంది. ఆగస్టు 15వ తేదీ ఎర్రకోటలో జరిగే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ఈసారి 1800 మంది ప్రత్యేక అతిథులను ఆహ్వానించారు. వీరిలో కూలీలు, మత్స్యకారులు, సర్పంచ్, నర్సింలు, ఉపాధ్యాయులు ఉన్నారు. కొత్త పార్లమెంట్ భవనం నిర్మాణంలో నిమగ్నమైన కార్మికులను ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు. కార్మికులు తమ భార్య లేదా కుటుంబ సభ్యులతో కలిసి ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. అదే సమయంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ పథకంతో సంబంధం

మిగతా 2లో...

# వరంగల్‌లో .. గులాబీ టిక్కెట్ల లొల్లి

### బస్తీ మే సవాల్ అంటున్న నేతలు

వరంగల్- ప్రభాత సూర్యుడు

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఫిట్టింగ్ పెట్టేలా పావులు కదుపుతున్నారు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు ఃఖీా నేతలు. ఎలాగైనా టికెట్ దక్కించుకోవాలని చూస్తున్నారు. ఫలితంగా అసమ్మతి సెగలు ఇప్పుడిప్పుడే తెరపైకి వస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. మరికొద్ది రోజుల్లో తెలంగాలో ఎన్నికల యుద్ధం షురూ కాబోతుంది. ఇప్పటికే ప్రధాన పార్టీలు ఆ దిశగా అడుగులు వేస్తున్నాయి. రేసు గుర్రాలపై ఫోకస్ పెడుతున్న ఆయా పార్టీల అధినాయకత్వాలు... టికెట్లు ఆశించి భంగపడే నేతలను తమ సైడ్ తిప్పుకోవాలని చూస్తున్నాయి. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బీఆర్ఎస్ లో అసమ్మతి సెగలు నెమ్మదిగా తెరపైకి వస్తున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఫిట్టింగ్ పెట్టాలా టికెట్ ఆశిస్తున్న నేతలు అడుగులు వేస్తున్నారు. ఎలాగైనా టికెట్ దక్కించుకోవాలని... అలా జరగకపోతే సిట్టింగ్ ఎమ్మెల్యేల విజయావకాశాలను ప్రభావితం చేయాలని చూస్తున్నారు. ఫలితంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బీఆర్ఎస్ వర్గపోరు.. ఎవరికి లాభం చేకూరుస్తుందనేది టాక్ ఆఫ్ ది పాలిటిక్స్ గా మారింది.ఉమ్మడి వరంగల్ జిల్లాలో అంతర్గత కుమ్ములాటలతో అధికార పార్టీ బీఆర్ఎస్ లో రాజకీయం తెగ హీటెక్కుతోంది. ఉమ్మడి జిల్లాలో 12

మిగతా 2 లో...

# మెదక్ కమలంలో.. లీడర్ల వేట

సంగారెడ్డి- ప్రభాత సూర్యుడు

తెలంగాణ వ్యాప్తంగా దూసుకుపోవాలని కమలం పార్టీ పెద్దలు ఇప్పటికే నేతలకు సూచనలు చేశారు. దీంతో బీజేపీలోని పెద్ద నేతలంతా ఆ ఆలోచనతో ముందుకు వెళ్తుంటే.. ఆ నియోజకవర్గ బీజేపీ నేతలు మాత్రం చాలా సైలెంట్ అయ్యారట. గత కొద్దిరోజుల క్రితం హడావుడి చేసిన నేతలు, ఇప్పుడు అసలు నియోజకవర్గాన్ని పట్టించుకోవడమే లేదట.. దీంతో అక్కడ బీజేపీ పార్టీ ఉందా లేదా అనే అనుమానాలు వస్తున్నాయని.. టాక్ వినిపిస్తోంది. ఇంతకి అది ఏ నియోజకవర్గం.. ఎవరా.. నేత అనే వివరాలు తెలుసుకోండి.. సంగారెడ్డి.. ఆందోల్–జోగిపేట నియోజకవర్గంలోని కమలం పార్టీకి అర్జెంట్ గా లీడర్లు కావాలంట.. గత కొద్దిరోజులుగా పార్టీని నడిపే లీడర్లు లేకపోవడంతో కార్యకర్తలందరూ నైరాశ్యంలో ఉన్నారట.. ఆందోల్–జోగిపేట బీజేపీ పార్టీలో లీడర్లు లేరా అంటే.. గట్టి నేతలే ఉన్నారు.. కానీ,ఈ మధ్య కాలంలో

మిగతా 3 లో...

## శివాలయంపై కొండచరియలు విరిగిపడి
# 9 మంది మృతి



సిమ్లా - ప్రభాత సూర్యుడు

సిమ్లా లోని సమ్మర్ హిల్ ప్రాంతంలో గల శివాలయంపై కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ప్రమాదంలో 9 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఉత్తర భారతంలో నేటి నుంచి శ్రావణమాసం మొదలైంది. దీంతో శ్రావణమాసం మొదటి సోమవారం కావడంతో శివాలయాలకు భక్తులు

మిగతా 2లో...

# జిల్లాల పర్యటనలకు కేసీఆర్




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ ముఖ్య మంత్రి కేసీఆర్ జిల్లాల పర్యటనకు ముహుర్తం ఖరారైంది. రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిస్థితులు, సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో.. ప్రజా క్షేత్రంలోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు సీఎం కేసీఆర్. ఆగస్టు చివరివారం నుంచి రెండు జిల్లాల్లో పర్యటనలు చేస్తూ.. బహిరంగ సభల్లో పాల్గొన బోతున్నారు. ఈ సభల ద్వారా ఎన్నికల వాతావరణం సృష్టించేలా గులాబీ బాస్ ప్రణాళికగా తెలుస్తోంది. అసెంబ్లీ సమావేశాలకు ముందు ఆగస్టులోని ఈ వారం చివరలో మెదక్ జిల్లా, సూర్యాపేట జిల్లాలలో ప్రభుత్వ కార్యక్రమాలతోపాటు, పలు బహిరంగ సభల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ రోడ్ మ్యాప్ సిద్ధమయింది. అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీస్కెళ్లడంతో పాటు.. తన బహిరంగ సభల ద్వారా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలని ఎండగట్టడమే సీఎం కేసీఆర్ వ్యూహంగా తెలుస్తోంది.ఆగస్టు 19న మెదక్ జిల్లాలో కలెక్టర్ కార్యాలయాన్ని, జిల్లా పోలీసు (ఎస్పీ) కార్యాలయాన్ని ప్రారంభించి.. బహిరంగ సభలో పాల్గొంటారు కేసీఆర్. సభ కంటే ముందు జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. ఇప్పటికే మెదక్ జిల్లా నాయకులు.. గులాబీ అధినేత పాల్గొనే సభా నిర్వహణా పనుల్లో తలమునకలై ఉన్నారు.ఇక ఆగస్టు 20న సూర్యాపేట జిల్లాలో ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా సూర్యాపేట జిల్లా

మిగతా 2లో...

## బీజేపీ వంద అబద్దాలు
# బుక్ లెట్, సీడీ

### ఆవిష్కరించిన మంత్రి కేటీఆర్




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను, తెలంగాణకు చేసిన అన్యాయాలను వివరిస్తూ బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా విభాగం రూపొందించిన "బీజేపీ వంద అబద్దాలు" బుక్ లెట్, సీడీనీ గౌరవ రాష్ట్ర మంత్రి కేటీఆర్ ప్రగతిభవన్ లో ఆవిష్కరించారు. బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా విభాగం నాలుగు నెలలుగా బీజేపీ వైఫల్యాలను బట్టబయలు చేస్తూ వస్తోంది. బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్లుగా ఉన్న మన్నె

మిగతా 2లో...

# ఇంటింటా జాతీయ జెండా
## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

స్వాతంత్ర వేడుకల సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తరఫున అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఈ రెండు రోజులపాటు దేశంలో ప్రతి ఇంటిపైన జాతీయ జెండా ఎగురవేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశంలో ప్రతి ఒక్కరు 75వ స్వాతంత్ర వేడుకలలో భాగ్యసాములు కావాలి. ప్రతి గ్రామంలో యువకులు తిరంగ యాత్ర మోటార్ సైకిల్ లతో ర్యాలీ నిర్వహించాలి. వ్యాప్తంగా ప్రతి మండల్, జిల్లా కేంద్రాలలో పాటు ఢిల్లీలో కూడా 75 మొక్కలు నాటాలని అన్నారు.. ఈ సందర్భంగా చెట్లను నాటే కార్యక్రమాన్ని అమృత వనంగా పేరు పెట్టడం జరిగింది. ప్రపంచంలో భారతదేశం విశ్వ గురువు స్థానంలో ఉండాలి. దేశంలో నిరుద్యోగ పేదరిక, సమస్యను నిర్మూలన చేయాలి. ప్రతి ఒక్కరూ చెట్లు నాటాలి.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకే కార్యక్రమం చేపడుతున్నాం ప్రతి ఒక్కరు భాగ్యస్వాములు కావాలని అన్నారు.

# పోటీపై క్లారిటీ వస్తే.. విలీనమే



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు షర్మిల .. కాంగ్రెస్‌లో విలీనంపై తుది నిర్ణయం తీసుకునేందుకు ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి కొన్ని హామీల విషయంలో స్పష్టత రావాల్సి ఉండటంతో ఎదురు చూస్తున్నారు. ఢిల్లీలో ఖర్గేతో సమావేశం అయిన షర్మిల.. పలు అంశాలపై చర్చలు జరిపి హైదరాబాద్ తిరిగి వచ్చారు. వచ్చే వారం రోజుల్లో మొత్తం చర్చలు పూర్తవుతాయని వైఎస్ఆర్‌టీపీ వర్గాలు చెబుతున్నారు. షర్మిల పార్టీ విలీనం తర్వాత తనకు లభించే ప్రాధాన్యతపై స్పష్టత కోరుతున్నారు. తనకు పాలేరు టిక్కెట్ ఇవ్వాలని అంటున్నారు. అయితే పాలేరు నుంచి పోటీ చేసేందుకు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెడీ అయ్యారు. దీంతో షర్మిలను సికింద్రాబాద్ నుంచి పోటీ చేయమని హైకమాండ్ ఆఫర్ ఇచ్చినట్లుగా చెబుతున్నారు. సికింద్రాబాద్ కాకపోయినా జంట నగరాల్లో ఏదో ఓ నియోజకవర్గం ఎంపిక చేసుకోవచ్చని సూచించినట్లుగా చెబుతున్నారు. అదే సమయంలో ఆమె సేవలు.. ఏపీకి కూడా అవసరం అని అక్కడ కూడా పని చేయాల్సి ఉంటుందని హైకమాండ్ చెప్పినట్లుగా తెలుస్తోంది. అయితే షర్మిల ఏపీ రాజకీయాల్లో జోక్యం చేసుకోవడానికి ఆసక్తిగా లేరని చెబుతున్నారు. తన ఇద్దరు బిడ్డలు వేర్వేరు రాష్ట్రాల్లో రాజకీయం చేస్తారని ఒకరికొకరికి

మిగతా 2లో...

# సీఎం పర్యటన ఏర్పాట్లు
## పరిశీలించిన మంత్రి హరీష్ రావు



మెదక్ - ప్రభాత సూర్యుడు

ఆగస్టు 19వ తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్ మెదక్ జిల్లాలో నూతన సమీకృత కలెక్టర్ భవనంతో పాటు ఎస్పీ ఆఫీస్ ప్రారంభించనున్న నేపథ్యంలో జరుగుతున్న పనులను ఆర్థిక ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు పరిశీలించి అధికారులతో

మిగతా 2లో...

# శివాలయంపై కొండచరియలు విరిగిపడి 9 మంది మృతి

(మొదటిపేజీ తరువాయి)

పోటెత్తారు. ఆ సమయంలో భారీ వర్షాలకు కొండ చరియలు విరిగి ఆలయంపై పడ్డాయి. ఈ ఘటనలో శివాలయం పూర్తిగా కుప్పకూలింది. శిథిలాల కింద 20 మందికిపైనే చిక్కుకున్నట్లు అధికారులు తెలిపారు. వారి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. ప్రమాద సమయంలో ఆలయంలో సుమారు 50 మందికిపైనే భక్తులు ఉన్నట్లు తెలిపారు.మరోవైపు తాజా ఘటనలపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుక్కు తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు స్థానిక యంత్రాంగం తీవ్రంగా శ్రమిస్తోందని తెలిపారు. 'భారీ వర్షాల కారణంగా సమ్మర్ హిల్ ప్రాంతంలోని శివ్ మందిర్ పై కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో ఆలయం కుప్ప కూలిపోయింది. ఈ ఘటనలో ఇప్పటి వరకూ తొమ్మిది మృతదేహాలను వెలికి తీశారు. స్థానిక యంత్రాంగం శిథిలాలను తొలగించేందుకు తీవ్రంగా కృషి చేస్తోంది' అని ఆయన పేర్కొన్నారు.మరోవైపు హిమాచల్ ప్రదేశ్‌లో గత 48 గంటలుగా నిరంతరాయంగా వర్షాలు కురుస్తున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. భారీ వర్షాలకు బియాస్ నది నీటిమట్టం పెరిగిందని చెప్పారు. రాష్ట్రంలో గత 24 గంటల్లో వర్షాలకు సంబంధించిన సంఘటనల్లో 21 మంది మరణించినట్లు చెప్పారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఇళ్లలోనే ఉండాలని సూచించారు. నదులు, కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్న ప్రాంతాలకు వెళ్లొద్దని విజ్ఞప్తి చేశారు.

# జిల్లాల పర్యటనలకు కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి)

కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించి.. అనంతరం కొత్తగా నిర్మించిన ఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. అదే సందర్భంలో..సీఎం కేసీఆర్ చేతుల మీదుగా నూతనంగా నిర్మించిన మెడికల్ కాలేజీ ప్రారంభించనున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల తర్వాత సూర్యాపేటలో నూతనంగా నిర్మించిన బిఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. అనంతరం పార్టీ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని సభలో ప్రసంగిస్తారు సీఎం కేసీఆర్.ఇదిలావుంటే తొలి జాబితాను బీఆర్ఎస్ పార్టీ రెడీ చేసినట్లుగా సమాచం. ఇందులో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు తొలి ప్రాధాన్యతనిస్తున్నట్లుగా తెలుస్తోంది. దుబ్బాక, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఎవరిని పోటీకి దింపాలనేది తొలి జాబితాలోనే ఫిక్స్ చేస్తారని ప్రచారంలో ఉంది. ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోగా రెండో లిస్టును ప్రకటించనున్నారు. అదే సమయంలో లెఫ్ట్ ఫార్టీలతో పొత్తు ఉంటుందా.. లేదా అనే విషయాన్ని తేల్చనున్నారు ముఖ్యమంత్రి.. మరోవైపు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ సిట్టింగ్ ఎమ్మెల్యేను బీఆర్ఎస్ పార్టీలోకి ఆగస్టు 17న లేదా 18న బీఆర్ఎస్‌లో చేరడం దాదాపు ఖాయమైనట్లుగా సమాచారం.. మొదటి జాబితాలో ఆ ఎమ్మెల్యే పేరు కూడా ఉండొచ్చని బీఆర్ఎస్ వర్గాలు అంటున్నాయి. సీఎం కేసీఆర్ మరోమారు గజ్వేల్ నుంచే పోటీ చేయడం పక్క అని సమాచారం.

# పంద్రాగస్టుకు ఎర్రకోట రెడీ

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న రైతులు కూడా వేడుకలో పాల్గొంటారు. చారిత్రాత్మకమైన ఎర్రకోటలో 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు 2023కి హాజరు కావాల్సిందిగా విద్యా మంత్రిత్వ శాఖ పాఠశాల ఉపాధ్యాయులను విశిష్ట 'ప్రత్యేక అతిథులుగా' ఆహ్వానించారు. పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం విద్యా రంగంలో అద్భుతంగా పనిచేసిన 50 మంది పాఠశాల ఉపాధ్యాయులను ఎంపిక చేసింది. ఈ కార్యక్రమంలో పాల్గొనే ఉపాధ్యాయులందరూ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్, దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయ సంగతన్ పాఠశాలలకు చెందినవారు.ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతం నుంచి 75 మంది జంటలను తమ సంప్రదాయ దుస్తుల్లో ఎర్రకోటలో జరిగే వేడుకల్లో పాల్గొనేందుకు ఆహ్వానించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో తెలిపింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది భారీ సంఖ్యలో అతిథులను ఆహ్వానించినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రత్యేక అతిథులుగా వారి జీవిత భాగస్వాములతో పాటు దాదాపు 1,800 మందిని ఆహ్వానించారు. ప్రభుత్వ ప్రజా భాగస్వామ్య విధానానికి అనుగుణంగా ఈ కార్యక్రమం చేపట్టడం జరిగింది.ఈ ప్రత్యేక అతిథులు 660 కంటే ఎక్కువ వైబ్రెంట్ గ్రామాలకు చెందిన 400 మందికి పైగా సర్పంచ్‌లు, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ స్కీమ్‌తో అనుబంధించబడిన 250 మంది రైతులు, కొత్త పార్లమెంటు భవనంతో సహా సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్‌తో అనుబంధించబడిన 50 మంది కార్మికులు ఉంటారు. అంతేకాదు ఖాదీ కార్మికులు, సరిహద్దు రహదారుల నిర్మాణం, అమృత సరోవర్, హర్ ఘర్ జల్ యోజన, అలాగే ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, నర్సులు, మత్స్యకారులతో సంబంధం ఉన్న వ్యక్తులు కూడా పాల్గొంటారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం ఢిల్లీలోని వివిధ 12 చోట్ల సెల్ఫీ పాయింట్లు కూడా పెట్టారు. వీటిలో నేషనల్ వార్ మెమోరియల్, ఇండియా గేట్, విజయ్ చౌక్, న్యూఢిల్లీ రైల్వే స్టేషన్, ప్రగతి మైదాన్, రాజ్ ఘాట్, జామా మసీద్ మెట్రో స్టేషన్, రాజీవ్ చౌక్ మెట్రో స్టేషన్, ఢిల్లీ గేట్ మెట్రో స్టేషన్, ఝూ మెట్రో గేట్, నౌబత్ ఖానా, షీష్ గంజ్ గురుద్వారా ఉన్నాయి. ఈ సెల్ఫీ పాయింట్లు కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాలు, కార్యక్రమాలను ప్రదర్శిస్తాయి.10 వేల మందితో భద్రతస్వాతంత్ర్య దినోత్సవం కోసం ఢిల్లీ అంతటా అంతటా ప్రధాన వేదిక ఎర్రకోట, కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వెళ్లే మార్గంలో మోహరించిన 10,000 మంది అధికారులతో భద్రతా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. నేరుస్తులను గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ కూడా అమల్లో ఉందని అధికారి తెలిపారు. ఆఅఖ (నార్త్) సాగర్ సింగ్ కల్సి అధికార పరిధిలో ఎర్రకోట ఉంది. గత రెండు నెలలుగా, హోటళ్లు, గెస్ట్ హౌస్‌లు, పేయింగ్ గెస్ట్ వసతి, లాడ్జీల వద్ద కఠినమైన ఐటెంటిఫికేషన్ డ్రైవ్ నిర్వహించారు. అనుమానాస్పద వస్తువులు, వ్యక్తుల కోసం తనిఖీలు చేపట్టారు. నగరంలోని ప్రతి పికెట్ వద్ద ప్రతిరోజూ వందల వాహనాలను తనిఖీ చేశారు. స్థానిక సంక్షేమ సంఘాలు, మార్కెట్ సంఘాలతో సమావేశాలు నిర్వహించారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమస్యాత్మక, వ్యూహాత్మక ప్రదేశాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశామని, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ), నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ (ఎన్ఎస్‌జీ)తో సహా యాంటీ డ్రోన్ సిస్టమ్‌లను ఏర్పాటు చేసినట్లు మరో అధికారి తెలిపారు. అలాగే ప్రజలకు ఢిల్లీ ట్రాఫిక్ పోలీసులు పలు సూచనలు చేశారు. మంగళవారం తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు ఎర్రకోట పరిసర ప్రాంతాల్లో రోడ్లు మూసివేయనున్నట్లు పేర్కొన్నారు. నేతాజీ సుభాష్ మార్గ్, లోథియన్ రోడ్, ఎస్పీ ముఖర్జీ మార్గ్, చాందినీ చౌక్ రోడ్, నిషాద్ రాజ్ మార్గ్, ఎస్ప్లానేడ్ రోడ్, దాని లింక్ రోడ్, రాజ్‌ఘాట్ నుంచి ఐఎస్‌బీటీ వరకు రింగ్ రోడ్, ఐఎస్‌డీటీ నుంచి ఐపీ ఫ్లైఓవర్ వరకు, ఔటర్ రింగ్ రోడ్డు ఇదే సమయంలో మూసివేస్తున్నట్లు చెప్పారు.

ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (డీటీసీ) బస్సులను ఆదివారం అర్ధరాత్రి నుంచి ఆగస్టు 15 ఉదయం 11 గంటల వరకు కశ్మీర్ గేట, రింగ్ రోడ్ మీదుగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా పార్కింగ్ లేబుల్స్ లేని వాహనాలు సి-హెక్సాగాన్, ఇండియా గేట్, కోపర్నికస్ మార్గ్, మండి హౌస్, సికంద్రా రోడ్, డబ్ల్యూ పాయింట్, ఎ పాయింట్ తిలక్ మార్గ్, మధుర రోడ్, బీఎస్‌జెడ్ మార్గ్, నేతాజీ సుభాష్ మార్గ్, జెఎల్ నెహ్రూ నుంచి మార్గ్, నిజాముద్దీన్ ఖట్టా ఝాఐ కష్మీరే గేట్ మధ్య రింగ్ రోడ్, నిజాముద్దీన్ ఖట్టా నుంచి ఝాఐ కశ్మీర్ గేట్ వరకు సలీంఘర్ బైపాస్ మీదుగా ఔటర్ రింగ్ రోడ్ మార్గంలో వెళ్లాలని సూచించారు. 1800 మంది ప్రత్యేక ఆహ్వానితులుస్వాతంత్ర వేడుకలకు దేశం నలుమూల నుంచి సామాన్యులు 1800 మందిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఇందులో 400 మంది సర్పంచ్‌లు, 250 మంది వ్యవసాయ, రైతు అనుబంధ సంఘాలకు చెందిన వారు ఉన్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, ప్రధాన మంత్రి కౌషల్ వికాష్ యోజన లబ్ధిదారులు 50 మంది చొప్పున ఆహ్వానించారు.పార్లమెంటును నిర్మించిన కూలీలు, జాతీయ అవార్డు పొందిన పాఠశాల ఉపాధ్యాయులు, సరిహద్దు రోడ్ల సంస్థ కార్మికులు, అమృత్ సరోవర్, హర్ ఘర్ జల్ యోజన ప్రాజెక్ట్ కోసం సహాయం చేసినవారు, పనిచేసినవారు, చేనేత కార్మికులు 50 మంది చొప్పున ఈ ప్రత్యేక ఆహ్వానితుల జాబితాలో ఉన్నారు. వీరంతా ఎర్రకోట వద్ద జెండా వందనంలో పాల్గొంటారు. ఈ ప్రత్యేక అతిథులలో కొందరు జాతీయ యుద్ధ స్మారక చిహ్నాన్ని సందర్శించి, ఢిల్లీలో రక్ష రాజ్య మంత్రి అజయ్ భట్‌ను కలవనున్నారు.మార్చి 12, 2021న గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లోని సబర్మతి ఆశ్రమం నుంచి ప్రధాని ప్రారంభించిన 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' వేడుకలను ఈ సంవత్సరం స్వాతంత్ర దినోత్సవం ముగుస్తుంది.

## బీజేపీ వంద అబద్ధాలు

# బుక్ లెట్, సీడీ

(మొదటిపేజీ తరువాయి)

క్రిషాంక్, వై.సతీష్ రెడ్డి , జగన్ మోహన్ రావు , దినేష్ చౌదరి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దేశ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోడీ సర్కారు ఎలా మోసం చేసింది..? తెలంగాణ ప్రజలకు హక్కుగా రావాల్సిన వాటిని ఎలా అడ్డుకుంటున్నారనే విషయాలను ఇందులో వివరించారు. బీజేపీ తప్పులను ప్రతీరోజు బయట పెడుతున్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, భారంగా మారిన జీఎస్టీ, ప్రతీ ఇంటికి ఇంటర్నెట్ సదుపాయం, అందరికీ ఇల్లు, విభజన హామీల అమలు, బయ్యారం స్టీల్ ప్లాంట్, ఐటీఐఆర్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఎస్టీ రిజర్వేషన్లతో పాటు.. బీజేపీ నాయకుల అసలు రూపాన్ని ఈ క్యాంపెయిన్ లో బయటపెట్టడం జరిగింది. సోషల్ మీడియా కన్వీనర్లు చేపట్టిన "బీజేపీ వంద అబద్దాలు" క్యాంపెయిన్ ను మంత్రి కేటీఆర్ అభినందించారు. అబద్ధాల పునాదుల మీద రాజకీయం చేస్తున్న బీజేపీ అసలు రూపాన్ని ప్రజల ముందు ఉంచారన్నారు. బుక్ లెట్, సీడీ ద్వారా బీజేపీ తప్పులను, వైఫల్యాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లి వాస్తవాలను గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు తెలిసేలా చేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వివేకానంద్ గౌడ్, ఎంపీ బీబీ పాటిల్ పాల్గొన్నారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లు

(మొదటిపేజీ తరువాయి)

సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ఎమ్మెల్యేలు పద్మ దేవేందర్ రెడ్డి,భూపాల్ రెడ్డి, క్రాంతి కిరణ్, ఎమ్మెల్సీ యాదవ్ రెడ్డి, కలెక్టర్, ఎస్పీ ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు. అనంతరం బహిరంగ సభ జరిగే ప్రదేశాన్ని పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతపై అధికారులకు తగు సూచనలు చేశారు.

## పోటీపై క్లారిటీ వస్తే..

# విలీనమే

(మొదటిపేజీ తరువాయి)

పోటీ ఉండదని విజయలక్ష్మి చెబుతూ వస్తున్నారు. ఇప్పుడు షర్మిల ఏపీలో ప్రచారం చేస్తే అది జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకం అవుతుంది. అందుకే షర్మిల తటపటాయిస్తున్నారని అంటున్నారు. కాంగ్రెస్ హైకమాండ్ కూడా షర్మిలను పూర్తి స్థాయిలో ఏపీలో పార్టీ పునర్వైభవం కోసం ఉపయోగించుకోవాలని భావిస్తోంది. వైఎస్ మరణం తర్వాత ఆయన కుమారుడు జగన్ సొంత పార్టీ పెట్టుకోవడంతో కాంగ్రెస్ ఓటు బ్యాంక్ అంతా వైసీపీకి వెళ్లిపోయింది. మళ్లీ కాంగ్రెస్ ఓటర్లు కాంగ్రెస్ కు రావాలంటే... వైఎస్ఆర్ వారసుల్లో ఒకరు అయిన షర్మిల వల్లే సాధ్యమని అంచనా వేస్తున్నారు. అందుకే ఈ ఎన్నికల్లో షర్మిలకు తెలంగాణలో పోటీ చేయడానికి సీటు ఇచ్చినా .. తర్వాత జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో .. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున కీలక పాత్ర పోషించేలా చేయాలనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. దక్షిణాదిన కాంగ్రెస్ పార్టీకి ఒకప్పు? కంచుకోటల్లాంటి రాష్ట్రాలు ఉండేవి. అందులో ఏపీ కూడా ఒకటి. ఒక సారి అధికారం కోల్పోయినా.. మళ్లీ చేతికి అధికారం అందుతూ ఉండేది.కానీ.. రాష్ట్ర విభజన తర్వాత

# వరంగల్ లో గులాబీ టిక్కెట్లు లొల్లి

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గాలు ఉండగా.. అన్నిచోట్ల వర్గపోరు రచ్చకెక్కింది. ఇరు వర్గాలు మాటల తూటాలు పేల్చుకుంటున్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో సిట్టింగ్ లు,ఆశావహులు టిక్కెట్ల వేట మొదలుపెట్టారు. ఈ సారి ఎలాగైనా టిక్కెట్ దక్కించుకోవాలని ద్వితీయ శ్రేణి నాయకులు, ఉద్యమకారులు ప్రయత్నిస్తున్నారు. అయితే నియోజకవర్గాన్ని అద్దంలా తీర్చిద్దిదామని తమకే అధినేత పార్టీ బీ ఫాం ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇన్నాళ్లు పార్టీ, ఎమ్మెల్యే కోసం పనిచేసినా.. తమకు సరైన స్థానం కల్పించలేదని ద్వితీయ శ్రేణి నాయకులు, ఉద్యమకారులు గరం గరం అవుతున్నారు. దీంతో ఎమ్మెల్యేలు రంగంలోకి దిగి అసంతృప్తులను బుజ్జగించే పనిలో నిమగ్నమయ్యారు. అయినా అన్ని నియోజకవర్గాల్లో అసమ్మతిగళం కొనసాగుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.పాలకుర్తిలో వరుస విజయాలతో దూసుకెళు న్నారు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. రాబోయే ఎన్నికల్లో కూడా ఇదే నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి గెలవాలని చూస్తున్నారు. అయితే ఎర్రబెల్లికి కూడా అసమ్మతి మంటలు అంటుకున్న సీన్లు కనిపిస్తున్నాయి. నియోజకవర్గంలో ముగ్గురు కీలక నేతలు బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరే యోచనలో ఉన్నట్టు తెలిస్తోంది. వీరు ముగ్గురు కూడా దయాకర్ రావుకు అత్యంత సన్నిహితులు కావడం విశేషం. అయితే వీరితో మంత్రి ఎర్రబెల్లి చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. పార్టీని వీడకుండా బుజ్జగిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఇదే విషయంపై సదరు నేతలు స్పందిస్తూ పార్టీ కోసం పని చేస్తామంటూ ఓ ప్రకటన కూడా విడుదల చేయటం కొసమెరుపుగా మారింది. అయితే ఎర్రబెల్లి బుజ్జింగుపులతో దారిలోకి వచ్చారా..? లేక చివరి నిమిషంలో హ్యాండ్ ఇస్తారా అనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.ఇక వర్ధన్నపేట బీఆర్ఎస్ లో వర్గపోరు తారాస్థాయికి చేరింది.ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ పై సొంత పార్టీ నేతలే తిరుగుబావుటా ఎగురవేశారు. అసమ్మతి నేతలంతా డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు నేతృత్వంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును కలిసి ఈ సారి వర్ధన్నపేట నుంచి ఆరూరిని తప్పించాలని కోరారు. దీంతో దయాకర్ రావు అసంతృప్త నేతలను బుజ్జగించినట్లు తెలిసింది. పార్టీ అధిష్ఠాన నిర్ణయానికి కట్టుబడి ఉండాలని వారికి నచ్చచెప్పినట్లు సమాచారం. మరోవైపు జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఇప్పటికే భూ కబ్జా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు సొంత పార్టీ నేతలతోపాటు కూతురి నుంచి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల ఓ భూమి విషయంలో ముత్తిరెడ్డి కూతురు తుల్జా భవానీరెడ్డి ఆయనపై కేసు పెట్టడం చర్చానీయాంశంగా మారింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు అత్యంత సన్నిహితుడైన పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఇక్కడి నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు. అంతేకాకుండా, పాలకుర్తిలో మంత్రి దయాకర్ రావుకు వ్యతిరేక పవనాలు వీస్తుండటంతో ఆయన కూడా జనగామపై దృష్టిసారించినట్లు ప్రచారం జరుగుతోంది. స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గంలో ఇద్దరు సీనియర్ నేతలు కయ్యానికి కాలు దువ్వుకుంటున్నారు. ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. అధిష్ఠానం ఆశీస్సులు నా కంటే నాకే ఉన్నాయని ఒకరికొకరు కార్యకర్తల వద్ద చెప్పుకుంటున్నారు.వీరివురి వ్యవహారం చిలికి చిలికి గాలి వానలా మారడంతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పిలిచి మాట్లాడారు. అయినా వారి మధ్య అదే స్థాయిలో వైరం కొనసాగుతున్నది.ఈ ఇద్దరు మాజీ డిప్యూటీ సీఎంలు ఢీ అంటే ఢీ అంటూ ఎవరికి వారిగా కార్యక్రమాలు చేసుకుంటున్నారు. ఇక డోర్నకల్ లో చూస్తే ఇది ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గం. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన రెడ్యా నాయక్ ఆ తర్వాత బీఆర్ఎస్ లోకి వచ్చారు. 2018లో బీఆర్ఎస్ బీ ఫాం అందుకొని.. విజయం సాధించారు. అప్పటి నుంచి తిరుగులేని నేతగా ఉన్న రెడ్యాకు మంత్రి సత్యవతి రాథోడ్ ప్రతిబంధకంగా మారారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సత్యవతి రాథోడ్ ను ఎమ్మెల్సీ చేసి మంత్రి పదవి కట్టబెట్టారు. ప్రస్తుతం ఆమె డోర్నకల్ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు పావులు కదుపుతున్నారు. వీరిద్దరు తమ అనుచరులతో టిక్కెట్ తమకే వస్తుందంటూ ప్రచారం చేసుకుంటున్నారు.మహబూబాబాద్ ఎమ్మెల్యేగా శంకర్ నాయక్ కొనసాగుతున్నారు. ఇటీవల ఈ నియోజకవర్గంలో వర్గవిభేదాలు రచ్చకెక్కాయి. ఈ సారి ఎమ్మెల్యేగా శంకర్ నాయక్ వద్దంటూ బీఆర్ఎస్ నేతలు మానుకోటలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దీని వెనుక ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు ఉన్నారని శంకర్ నాయక్ భావిస్తున్నారు. 2014లో శంకర్ నాయక్ కు టిక్కెట్ రావడంలో రవీందర్ కృషి ఉంది. తర్వాత వీరి మధ్య సంబంధాలు కట్ అయ్యాయి.తనకు ఈ సారి టిక్కెట్ రాకుండా ఎమ్మెల్సీ అడ్డుకుంటున్నాడని శంకర్ నాయక్ తన అనుచరుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాగా... ఇదే నియోజకవర్గం నుంచి ప్రస్తుత ఎంపీ మాలోతు కవిత బరిలో దిగేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. మంత్రి సత్యవతి రాథోడ్ కూడా డోర్నకల్ సీటు దక్కపోతే అయితే ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు సై అంటున్నారు. ఫలితంగా మానుకోటలో రాజకీయ మంటలు కాకరేపుతున్నాయి.వరంగల్ తూర్పులో నన్నపనేని నరేందర్ కు సొంత పార్టీ నుంచి పోటీ ఉంది. ఏ నియోజకవర్గంలో లేనివిధంగా ఇక్కడి నుంచే ఎక్కువ మంది ఎమ్మెల్యే స్థాయి నేతలు ఉన్నారు. తూర్పు టిక్కెట్ కోసం ఎవరికి వారు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. కాగా, కొందరు నేతలు తిరుగుబావుట ఎగుర వేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిసింది. వారి వెనుక పెద్ద తలకాయలే ఉన్నాయి. ప్రస్తుం నివురుగప్పిన నిప్పులా ఉంది. బస్వరాజు సారయ్యతో పాటు చాలా మంది నేతలు ఇక్కడి టికెట్ ను ఆశిస్తున్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలో కూడా బీఆర్ఎస్ లో లుకలుకలు కొనసాగుతున్నాయి. 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి మధుసూదనాచారి,కాంగ్రెస్ నుంచి గండ్ర వెంకటరమణారెడ్డి పోటీ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి గండ్ర గెలుపొందారు. ఆ తర్వాత ఆయన కారెక్కారు. దీంతో గులాబీ పార్టీలో ఇటు మధుసూదనాచారి, అటు వెంకటరమణారెడ్డి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఈ క్రమంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మధుసూదనాచారికి ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టారు. అయితే, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భూపాలపల్లి టిక్కెట్ తనకంటే తనకు అని ఇద్దరు ప్రచారం చేసుకుంటున్నారు. ఇరువురు పోటాపోటీగా నియోజకవర్గంలో కలియ తిరుగుతున్నారు.పరకాల నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా చల్లా ధర్మారెడ్డి కొనసాగుతున్నారు. బీఆర్ఎస్ పార్టీలో అసమ్మతి ఉన్నప్పటికీ అనుభవం కలిగిన చల్లా అన్ని సరిదిద్దినట్లు తెలిసింది. ఇదే టికెట్ ను నాగుర్ల వెంకన్న ఆశిస్తున్నారు.

పర్యటిస్తూ హల్ చల్ చేస్తున్నారు. ఇక వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ కు ఇంటి పోరు తప్పేలా లేదు. ఆయన సోదరుడు మాజీ మంత్రి ప్రణయ్ భాస్కర్ కుమారుడు కార్పొరేటర్ అభినవ్ భాస్కర్ నుంచి పోటీ ఎదురయ్యేలా ఉంది. ప్రణయ్ కి ప్రజల్లో మంచి పేరు ఉండటం.. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వినయ్ పై కొంత వ్యతిరేకత ఉండటం తనకు కలిసి వస్తాయని అభినవ్ భాస్కర్ భావిస్తున్నారు. టికెట్ ఇవ్వకపోతే స్వతంత్రగా కూడా పోటీ చేస్తారనే చర్చ జోరుగా నడుస్తోందిఉమ్మడి వరంగల్ జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ గెలిచిన ఏకైక సీటు ములుగు. అయితే వచ్చే ఎన్నికల్లో ఇక్కడ్నుంచి గెలవాలని బీఆర్ఎస్ భావిస్తోంది. అయితే ఇక్కడ ఎమ్మెల్యే ఉన్న సీతక్కను ఢీకొట్టే స్థాయి నేతలు లేకపోవటం ఇబ్బందికరంగా మారింది. మాజీ ఎంపీ సీతారాం నాయక్ ములుగు నుంచి పోటీ చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఈ మేరకు ఇదే విషయం అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. మాజీ మంత్రి, దివంగతనేత చందూలాల్ కూమారుడు ప్రహ్లాద్ సైతం ఈ సారి బరిలో దిగాలని తహతహలాడుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. వీరే కాకుండా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బడే.నాగజ్యోతి టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు.ఇక నర్సంపేట బీఆర్ఎస్ లో ఆసక్తికర పరిస్థితి కనిపిస్తోంది. అంతర్గత కుమ్ములాటలున్నప్పటికీ ఇప్పటి వరకు బాహటం కాలేదు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి భార్య స్వప్న తాను సైతం ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఊవ్విళ్లూరుతున్నారు.

## సంపాదకీయం

# శతాబ్దాల పోరాటం, త్యాగం, అచంచలమైన సంకల్పం

పంద్రాగస్టు.. భారత దేశం పరాయి పాలననుంచి స్వాతంత్ర్యం పొందిన చారిత్రక ఘట్టాన్ని స్మరించుకునే రోజు.. 1947లో బ్రిటీష్ వలస పాలన నుంచి భారతదేశం విముక్తి పొందిన తర్వాత ప్రతి సంవత్సరం ఆగస్టు 15న భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ మహత్తర సందర్భం శతాబ్దాల పోరాటం, త్యాగం, అచంచలమైన సంకల్పానికి ముగింపు పలికింది. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయుల అలుపెరగని పోరాటం, ప్రాణత్యాగం ఫలితంగా స్వాతంత్రం సిద్ధించిన రోజును మనం పండుగలా జరుపుకుంటున్నాం.దేశం సాధించిన విజయాలను ప్రతిబింబిస్తూ.. నిరంతర ప్రగతి ఆవశ్యకతను నొక్కి తెలియజేస్తారు. స్వాతంత్ర్య దినోత్సవం అనేది గతానికి సంబంధించిన వేడుక మాత్రమే కాదు.. దేశం ఉజ్వల భవిష్యత్తు కోసం ఎదురుచూసే అవకాశం.. ఇది భారత దేశానికి ఆధారమైన భిన్నత్వంలో ఏకత్వం, ప్రజాస్వామ్య విలువలను గుర్తు చేస్తుంది.స్వాతంత్ర్య దినోత్సవం యొక్క థీమ్ నేషన్ ఫస్ట్.. ఆల్వేస్ ఫస్ట్.. ఈ థీమ్ కష్ట సమయాల్లో కూడా దేశ ప్రయోజనాలకు మొదటి స్థానం ఇవ్వాలనే ప్రాముఖ్యతను గుర్తు చేస్తుందని ప్రభుత్వం తెలిపింది.పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడంతో ఈ రోజు ప్రారంభమవుతుంది.. ఆ తర్వాత దేశభక్తి గీతాలు పాడటం, సాంస్కృతిక ప్రదర్శనలు జాతీయ భావం నింపుతాయి. ఢిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోట నుండి దేశాన్ని ఉద్దేశించి ప్రధాని ప్రసంగిస్తారు. రోజంతా భారతదేశ గొప్ప సాంస్కృతిక వారసత్వం, వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు, కవాతులు జరుగుతాయి. ప్రజలంతా జెండా పండుగలో పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పిస్తారు. దేశం పట్ల తమకున్న ప్రేమను చాటుకుంటారు. అంతేకాదు.. దేశ ప్రగతి, ముందున్న సవాళ్లను ప్రజలు అంచనా వేసేందుకు ఈ రోజు ఒక సమయంగా ఉపయోగపడుతుంది. రాబోయే తరాలకు బలమైన, సమగ్రమైన, సంపన్నమైన దేశాన్ని నిర్మించాలనే నిబద్ధతను పునరుద్దరించేందుకు స్వాతంత్ర్య దినోత్సవం ఓ మంచిరోజు. 76వ స్వాతంత్ర్య దినోత్సవం: బ్రిటీష్ పాలన నుంచి దేశం స్వాతంత్ర్యం పొందిన ఒక సంవత్సరం తర్వాత భారతదేశం మొదటి స్వాతంత్ర్య దినోత్సవాన్ని 1948 ఆగస్టు 15న జరుపుకున్న వాస్తవం ఆధారంగా 76వ స్వాతంత్ర్య దినోత్సవంగా పరిగణించబడుతుంది. ఇది చాలా సాధారణమైన గణన పద్ధతి. భారతదేశం 15 ఆగస్టు 1947న స్వాతంత్ర్యం లభించిందనే వాస్తవం ఆధారంగా ఈ లెక్కింపు విధానం రూపిందించబడంది. కాబట్టి 2023 అనేది 77వ స్వాతంత్ర్య దినోత్సవం. అయితే ఎక్కువగా 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్నే పరిగణనలోని తీసుకుంటున్నారు. మరో వైపుఆగస్టు 15 వస్తోందనగానే చాలా చోట్ల జాతీయ జెండా రంగుల్లో దుస్తులు అమ్ముతున్నారు. చాలామంది ఇష్టంగా కొనుక్కుని ధరించి దేశభక్తిని చాటుకుంటారు. ఇలా జాతీయ జెండా రంగుల్లో దుస్తులు ధరించడంలో తప్పు లేదు. అయితే దానికి సంబంధించిన కొన్ని నియమాలు మాత్రం పాటించాలి. దీనికి సంబంధించి 2005లో లోక్‌సభ ఒక బిల్లును ఆమోదించింది. భారతీయ పౌరులు గౌరవప్రదంగా ధరిస్తే వారి దుస్తులలో భాగంగా త్రివర్ణాన్ని ధరించవచ్చును అని పేర్కొంది. అయితే 2005లోని సెక్షన్ 2 (ఇ) ప్రకారం జాతీయ జెండాను ఎవరూ నడుము కింద్రి నుంచే ధరించే దుస్తుల్లో వాడరాదు. జాతీయ జెండాను ఎలాంటి డ్రెస్ మెటీరియల్ పైన ముద్రించకూడదు అని స్పష్టం చేసింది.చట్టం ప్రకారం నడుము క్రింద భాగంలో ఎవరూ త్రివర్ణ పతాకాన్ని ధరించకూడదు. కుషన్లు, రుమాలు మరియు లో దుస్తులు వంటి రోజువారి ఉపయోగంలో వాడరాదు. కోడ్ ను ఉల్లంఘిస్తే కనీసం సంవత్సరకాలం జైలు శిక్ష విధిస్తారు. మూడు రంగుల టీ షర్టు, చీర, దుపట్టా లేదా తలపాగా, చెవి పోగులు, బ్యాంగిల్స్ వంటి ఉపకరణాల్లో రంగులు చేర్చుకోవచ్చు. మరి జాతీయ జెండా రంగుల్లో బట్టలు ధరించేటప్పుడు మరి జాగ్రతలు తీసుకోండి..

## ఎమ్మెల్యే దుర్గయ్యను అరెస్టు చేయాలి




**మంచిర్యాల - ప్రభాత సూర్యుడు :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పై తమ నిరసన కొనసాగిస్తున్నారు ఓ డైరీ నిర్వాహకురాలు. సోమవారం ఆమె హైదరాబాద్ నుంచి నేరుగా బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ చేరుకుని. ప్రధాన గేటు వద్ద తనకు న్యాయం కావాలంటూ ప్లకార్డు పట్టుకొని బైఠాయించారు. ఎమ్మెల్యే చిన్నయ్య తనను లైంగిక వేధించారని మరోసారి ఆరోపించారు.. దమ్ముంటే ఎమ్మెల్యే వెంటనే క్యాంప్ ఆఫీస్ కు రావాలని డిమాండ్ చేశారు. కాగా.. ధర్నా చేస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు ఆమెను అరెస్టు చేశారు. బెల్లంపల్లి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు.. శేజల్ కు మద్దతుగా బీజేపి కాంగ్రెస్ నాయకులు పోలీస్ స్టేషన్ కు తరలి వచ్చారు.. మరో వైపు ఎమ్మెల్యే మద్దతు దారులు సైతం పోలీస్ స్టేషన్ కు చేరుకోవడంతో కాస్త ఉద్రిక్త పరిస్తితి నెలకొంది .

## ఆదిలాబాద్ కాంగ్రెస్ భేటీలో ఘర్షణ

**ఆదిలాబాద్- ప్రభాత సూర్యుడు :** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ బిసి గర్జన సభలో ఉద్రిక్తత నెలకొంది. ఒక వర్గం కార్యకర్తలు పార్టీ నేత కంది శ్రీనివాస్ రెడ్డిని అడ్డుకోవడంతో ఘర్షణ ప్రారంభమయింది. అడ్డుకున్న కార్యకర్తలను నెట్టుకొని కంది శ్రీనివాస్ రెడ్డి సభా ప్రాంగణానికి వెళ్లారు. సభకు హాజరైన కాంగ్రెస్ సీనియర్ వి హన్మంత్ రావ్ ను వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో అయన సభ నుంచి వెళ్లిపోయారు. ఇటీవల డిసిసి అధ్యక్షుడు సాజీద్ ఖాన్ పై శ్రీనివాస్ రెడ్డిఆరోపణలు చేసినందుకు అడ్డుకున్నామని నిరసనకారులు తెలిపారు. మొత్తానికి సమావేశంలో స్వల్ప ఘర్షణ జరిగింది. పలువురు నేతలు కొట్టుకున్నారు. సభా ప్రాంగణం వద్ద రసాభాస నెలకొనడంతో సీనియర్లు విహెచ్ ను బుజ్జగించి స్టేజిపైకి తీసుకెళ్లారు. అప్పటికే కంది శ్రీనివాస్ రెడ్డి వర్గం సభ నుండి వెళ్లిపోయింది. తరువాత కాంగ్రెస్ బిసి ఐక్య వేదిక సభ ప్రారంభమయింది.

# బీసీ లకు రాజ్యాధికారం అందని ద్రాక్షగానే మిగిలింది

దేశంలో అత్యధిక ఓటర్లు బీసీ కులాల వారే అనే విషయం ప్రతి నాయకుడికి తెలుసు. కానీ వారికి రాజ్యాధికారం ఇవ్వడానికి అంగీకరించరు. బి సి కుల గణన విషయంలో ప్రజలను మభ్యపెడుతూ తప్పుదోవ పట్టించడం గాక, వారిని మరిపించి మురిపించే ప్రయత్నం చేయడమే తప్ప ఎలాంటి ప్రయోజనం లేదు అనే విషయం ప్రతి బీసీ ఓటరుకు తెలుసు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటికి బి సి కుల గణన కలగానే మిగిలిపోయింది. స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపునిచ్చిన బీసీ కులాలకు రాజ్యాధికారం కలగానే మిగిలిపోయింది. దేశ జనాభాలో 75 శాతం బి సి వారు ఉండగా వారికి సరైన రాజ్యాధికారం లేకపోవడం శోచనీయం. మన దేశంలో 1931లో తొలిసారిగా జనాభా లెక్కల సేకరణ ప్రారంభమైంది, ఆ సమయంలో మన దేశానికి అన్ని అధికారాలు లేవు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రతి పదేళ్లకోసారి జనాభా గణన చేపట్టాలని అంగీకరించారు. జనాభా లెక్కల ప్రక్రియ కొనసాగ ుతుండగా కుల గణన అంశం చర్చకు రాకపోవడం అత్యంత బాధాకరమైన విషయం. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల జనగణన సేకరణ చేపడుతున్నారు తప్ప 70 యేండ్లు గడిచిన నేటికీ బి సి కుల గణన చేపట్టడం లేదు. బీసీ కులాల గణన వివరాలు చేపట్టాలని సుప్రీం కోర్టు, బీసీ కమిషన్ ఎన్నోసార్లు చెప్పినా కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు ఎందుకు జాప్యం చేస్తున్నాయన్నది అంతు చిక్కని ప్రశ్నగా మారింది. బి సి కుల గణన వివరాలు చేపట్టక పోవ డానికి బలమైన కారణమేంటో ప్రతి బీసీ ఓటరు తెలు సుకోవాలి. మన దేశంలో ఉన్నటువంటి రాజ్యా ధికార వ్యవస్థలు, పార్లమెంట్ వ్యవస్థలు మరియు అసెంబ్లీ, కమిషన్ అనేక రాజకీయ పార్టీల కార్యవిర్వాహక శాఖలలో పనిచేస్తున్న వారు ఎంత శాతం? అందులో బి సి ల శాతం ఎంత? రాజకీయ నాయకులలో అత్యధిక శాతం పదవులు అనుభవించే వారి శాతం ఎంత? అనేది తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దేశ జనాభాలో 75 శాతం మంది బీసీ కులాలకు చెందిన వారు. కానీ రాజ్యాధికారాన్ని అనుభవిస్తున్న వారిలో 75 శాతం మంది అగ్రవర్ణాలకు చెందినవారే కావడం మరింత బాధాకరం. అగ్రవర్ణాలు శాశ్వతంగా పాలించేలా బీసీ కులాలను అణిచివేతకు గురిచేస్తున్నారనడంలో సందేహం లేదు.జనాభా లెక్కలలో ఎస్సీ ఎస్టీ కులాల వారీగా లెక్కలు తీయడం వల్ల వారికీ సరైన రిజర్వేషన్లు దక్కుతున్నాయి. బి సి కులాలవారీగా ఎలాంటి లెక్కలు లేకపోవడం వల్ల రిజర్వేషన్ల వాటా శాతం కోల్పోవాల్సి వస్తుందనేది ముమ్మాటికీ నిజం. అన్ని రాష్ట్రాలలో ఇదే పరిస్థితి. ఎన్నికల సమయంలో మాత్రమే ఈ సరి మేము గెలిస్తే బి సి లకు రాజ్యాధికారం ఇస్తామని మురిపించి ఓట్లు దండుకుం టున్నారు తప్ప బి సి లకు ఎలాంటి



అధికారాలు ఇవ్వడం లేదు.

**తెలంగాణలో బిసిలకు ప్రాధాన్యత కరువు: :** తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అనేకమంది బి సి లు. తెలంగాణ వస్తే తమ ఆకాంక్షలు నెరవేరి, విద్య, వైద్య, ఉద్యోగం ఉపాధి, ఆర్థిక స్వావలంబన లభిస్తుందని, తమ హక్కులకు రక్షణ కలుగుతుందని భావించి ఉద్యమాన్ని ఉధృతం చేయడమే కాకుండా పోలీస్ లాఠీ దెబ్బలకు వెనుతిరగకుండా, ఆత్మబలి దానాలకు కూడా లెక్కచేయకుండా అమరులైనారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వెన్నుదన్నుగా నిలిచి తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నారు. అమరులంతా బీసీలే కావడం గమనార్హం. మృతుల కుటుంబాలకు కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవటం శోచనీయం. స్వరాష్ట్రం వస్తే తమకు సరైన న్యాయం జరుగుతుందని భావించిన బి సి లకు 2014 ఎలక్షన్ లో నాయకులు ఈసారి గెలిస్తే బి సి కుల గణన చేపడతామని హామిచ్చారు. కానీ నేటికీ హామీ నెరవేరలేదు. ఉద్యమానికి ఊపిరి గా నిలిచిన బి సి లకు ఎన్నికల్లో సరైన సీట్లు కేటాయించకుండా వివక్ష చూపింది. తొమ్మిదేండ్ల పాలనలో విసుగు చెందిన బి సి కుల సంఘాలు స్వాతంత్ర్యం వచ్చి 75 యేండ్లు దాటిన ఇంకెన్నాళ్లు అర్ధ బానిసలుగా బ్రతకాలి అనే ప్రశ్నలు మేధావుల్లో, యువతలో తలెత్తుతున్నాయి. అంతర్గత వివక్షను వ్యతిరేకిస్తూ రాజ్యాంగం సూచించిన తమ హక్కుల పరిరక్షణ కోసం, పాలనలో సరైన వాటా కోసం, సమిష్టి ఉద్యమాలు ఎంతైనా అవసరమని భావిస్తూ బి సి కుల సంఘాలన్నీ ఐక్యంగా, ఇక లక్ష్యంగా రాజకీయ ఉద్యమ వేదికలను ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నారు.

**అత్యధిక ఓటర్లైన పద్మశాలీయులకు రాజ్యాధికారంలో మొండిచేయి:** భారతదేశంలో ఎంతో గొప్ప చారిత్రక నేపథ్యం ఉన్న పద్మశాలీయులు దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాల్లో సుమారు 2 కోట్ల 20 లక్షల మంది ఉన్నారు. పద్మశాలి సంఘం గణాంకాల ప్రకారం ఒక్క తెలంగాణలోనే 22 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు. ఇది అనధికారిక లెక్కల ప్రకారం మాత్రమే. అధికారిక లెక్కల ప్రకారం 23 లక్షల మంది ఓటర్లు ఉంటారు. నేటికీ తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక ఓటర్లు ఉన్న పద్మశాలి రాజకీయంగా ఎదగలేక పోవడం బాధాకరం. రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యే సత్తా ఒక్క పద్మశాలికే ఉందంటే అతిశయోక్తి కాదు. కొండా లక్ష్మణ్ బాపూజీ లాంటి నేతలకు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం వచ్చినా అగ్రకుల నాయకుల ఎత్తుగడలకు ముఖ్యమంత్రి కాలేకపోయారు. ఆ తర్వాత అగ్రవర్ణాల ఆధిపత్యం కోసం పద్మశాలీల కుల సంఘాలను విచ్ఛిన్నం చేసి వారిని ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవడం తప్ప రాజకీయంగా ఎదగకుండా అణచివేశారు. ప్రత్యేక తెలంగాణ సాదించుకుంటే రాజకీయంగా ఎదుగుతామని భావించిన పద్మశాలీయులకు 9 ఏళ్ల పాలనలో ఎన్నో ఒడిదుడుకులు, ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. పద్మశాలి వర్గంలో ఉన్న మేధావులు, విద్యావంతులు, యువకులు బానిస బ్రతుకు బ్రతికే కన్నా పోరాడితే పోయేది ఏమి లేదని రాజ్యాధికార సాధన కొరకు మరియు 2023 ఎలక్షన్ లో పద్మశాలీయుల సత్తా చాటడం కోసం కుల సంఘాల్లాంటిని ఒకే వేదిక గా నిలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కనీసం ఈసారి అయినా అగ్రవర్ణాల నాయకులు పద్మశాలీయులను రాజకీయంగా ఎదగనిస్తారా లేదా అనేది ఎదురుచూడాల్సిన అవసరం ఉంది.తెలంగాణ ఉద్యమంలో పెద్ద ఎత్తున పాల్గొన్న బీసీ కులాలు తమ అస్తిత్వాన్ని పక్కనపెట్టి ఎలాంటి స్వార్థం లేకుండా చిత్తశుద్ధితో ఉద్యమంలో పాల్గొన్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలను పట్టించుకోకుండా బీసీ వ్యతిరేక ధోరణి అవలంబిస్తూ వచ్చింది. బి సి లకు టిక్కెట్ల పంపకం లో కూడా పూర్తి వ్యతిరేకత చూపింది.

**బీసీలందరు ఏకం కావాలి:** అగ్రవర్ణాల ఆధిపత్యంతో అణచివేతకు గురవుతున్న బీసీలంతా ఒకే గొంతుకతో రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలని పలు బీసీ సంఘాలు సంకేతాలిస్తున్నాయి. రానున్న ఎన్నికల్లో బీసీల సత్తా చాటేందుకు కులాల వారీగా రాజకీయ పోరుబాట పట్టే సంఘాలు ఇప్పటి నుంచే సమావేశమవుతున్నాయి. ఏదిఏమైనా బీసీ ప్రజలంతా ఒక్కటిగా ఉండి హక్కుల పరిరక్షణ కోసం పోరాడితేనే రాజ్యాధికారం దక్కుతుందనేది జగమెరిగిన సత్యం.లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికలు వచ్చినపుడు మాత్రమే బీసీలకు రాజ్యాధికారం అంశం మరియు బీసీ కుల గణన విషయం తెరపైకి వస్తున్నాయి. ఎన్నికల తర్వాత ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతున్నారు. మళ్ళీ ఐదేండ్ల తర్వాత ఎదో ఒక ఆశ చూపి ఓట్లు దండుకుంటున్నారు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ కుల గణన ప్రక్రియను ప్రారంభించి బీసీలకు రాజ్యాధికారం అందించేలా కృషి చేయాలనీ ముక్తకంఠంతో దేశవ్యాప్తంగా ఉన్న బీసీ సంఘాలన్నీ కోరుకుంటున్నాయి.



వ్యాసకర్త
కోట దామోదర్
మొబైల్: 9391480475

# చంద్రుడికి చేరువలో చంద్రయాన్-3 స్పేస్‌క్రాఫ్ట్

**న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చందమామపైకి ప్రయోగించిన చంద్రయాన్-3 స్పేస్‌క్రాఫ్ట్ విజయ వంతంగా లక్ష్యం వైపు దూసుకెళ్తోంది. ఇప్పటికే భూ బాహ్య కక్ష్యను దాటించి స్పేస్‌క్రాఫ్ట్‌ను చంద్రుడి క్షక్ష్యలోకి పంపిన ఇస్రో శాస్త్రవేత్తలు.. ఇప్పుడు దానిని చంద్రుడికి చేరువ చేస్తున్నారు. ఇప్పటివరకు మూడు సార్లు చంద్రయాన్-3 కక్ష్యను తగ్గించగా.. సోమవారం ఉదయం నాలుగోసారి కూడా సక్సెస్‌ఫుల్‌గా చంద్రయాన్-3 స్పేస్‌క్రాఫ్ట్ కక్ష్యను తగ్గించారు.దాంతో చంద్రయాన్-3 మిషన్ చందమామకు మరింత చేరువైంది. ప్రస్తుతం చంద్రుడికి 150 కిలోమీటర్లు చీ 177 కిలోమీటర్ల కక్ష్యలో చంద్రయాన్-3 స్పేస్‌క్రాఫ్ట్ ఉన్నది. ఈ నెల 16న ఉదయం 8.30 గంటలకు మరోసారి స్పేస్‌క్రాఫ్ట్ కక్ష్యను తగ్గించనున్నారు. దాంతో అది చంద్రుడికి 100 కిలోమీటర్ల సమీపంలోని కక్ష్యలోకి ప్రవేశిస్తుంది. అనంతరం చంద్రయాన్-3 ల్యాండింగ్ మాడ్యూల్ ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి వేరుపడి చంద్రుడి ఉపరితలంపై దిగుతుంది.

# మెదక్ కమలంలో లీడర్ల వేట

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గన్ని అసలు పట్టించుకోవడం లేదట.. ఒకప్పుడు నాయకత్వం కోసం కొట్టుకున్న లీడర్లు ఇప్పుడు అస్సలు పార్టీని పట్టించుకోవడం లేదని టాక్ వినిపిస్తోంది. ఆందోల్ నియోజకవర్గ బీజేపీలో సీనియర్ లీడర్ బాబుమోహన్.. ఈయన నియోజకవర్గంలో కనిపించక చాలా రోజులైందట.. అందోల్ బీజేపీ నేతలకు టచ్‌లో కూడా లేరని బహిరంగంగా పేర్కొంటున్నారు బీజేపీ నేతలు..ఆందోల్ బాబూ మోహన్‌తోపాటు మరో నేత ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ జెడ్పి చైర్మన్ బాలయ్య.. వీరిద్దరు అందోల్ బీజేపీలో సీనియర్ లీడర్లు ఇప్పుడు వీరిద్దరు పార్టీని పట్టించుకోవడం లేదని సొంత పార్టీ క్యాడరే పేర్కొంటుండం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మొదట నియోజకవర్గ పరిధిలో బాబుమోహన్ బాగానే తిరిగే వారు.. అయితే అదే సమయంలో బాలయ్య బీజేపీ పార్టీలోకి రావడంతో ఇద్దరి మధ్య గొడవలు అయ్యాయట. ఏ కార్యక్రమం చేసిన ఎవరికి వారే చేసేవారట..అలాంటి నేతలు ఇప్పుడు నియోజక వర్గంలో కన్పిస్తాలేరని పేర్కొంటున్నారు. వీరిద్దరి తీరు ఉంటే ఉగాది లేకుంటే శివరాత్రి అన్నట్లుగా మారిందట.. ఒకప్పుడు ఆధిపత్యం కోసం కొట్టుకున్న ఈ ఇద్దరు నేతలు.. ఇప్పుడు ఉన్న అవకాశాన్ని కూడా చేజార్చుకుంటున్నట్లు తెలుస్తోంది.నియోజకవర్గ పరిధిలో ఉన్న బీజేపీ కార్యకర్తలను ముందుకు నడిపే లీడర్లు లేకపోవడంతో వాళ్ళు కూడా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారట.. ఇటీవల కాలంలో బీజేపీ అధినాయకత్వం ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చిన కూడా అందోల్-జోగిపేట్ నియోజకవర్గ పరిధిలోని జరగడం లేదట.. మొన్నటికి మొన్న బీజేపీ టిఫిన్ కార్యక్రమం నిర్వహించినప్పుడు కూడా ఉమ్మడి జిల్లాలో అన్ని నియోజక వర్గాల్లో జరిగాయి.. కానీ అందోల్-జోగిపేట్ లో మాత్రం టిఫిన్ భైటో కార్యక్రమం జరగలేదట.. అధికార పార్టీపై నిరసన కార్యక్రమాలు చేయడానికి కూడా ఈ లీడర్లు రావడం లేదని సొంత క్యాడరే విమర్శిస్తుండటం ఇప్పుడు పెద్ద తలనొప్పిగా మారింది.ఇతర ప్రతిపక్ష నేతలు అధికార పార్టీపై నిరసనలు తెలుపుతూ ఏదో ఒక కార్యక్రమం చేస్తుంటే.. బీజేపీ మాత్రం ఏం చేయలేదంటూ సొంత కార్యకర్తలు చెబుతుతుండటం చర్చనీయాంశంగా మారింది. పార్టీ కోసం పనిచేసే క్యాడర్ ఉన్న కూడా వారికి దిశ నిర్ధేశం చేసే నేతలు కరువైనరని ఆందోల్ బీజేపీలో ఆందోళన మొదలైంది. గతంలో ఓకే పార్టీలో ఉన్నప్పటికీ బాబుమోహన్, బాలయ్యకి ఇద్దరికి పడక ఎప్పుడూ ఏదో ఒక గొడవ పెట్టుకునేవారు.. ఆ సమయంలో ఎవరి వైపు ఉండాలో అర్థం కాక అగమయ్యాము.. ఇప్పుడు దిశానిర్దేశం చేసే లీడర్ లేక ఇలా ఆగం అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారట అందోల్ బీజేపీ క్యాడర్..బాబు మోహన్ లాంటి సినియర్ లీడర్ కూడా పార్టీని పట్టించుకొకపోతే.. మున్ముందు ఎలా అని కార్యకర్తలు బహిరంగంగా పేర్కొంటున్నారు. బాలయ్య ఎంట్రీ బాబుమోహన్ కి ఇష్టం లేదు.. అయిన సరే కొద్దీరోజులు ఇద్దరు ఎవరికి వారు నియోజకవర్గ పర్యటనలు చేశారు.. కానీ ఒకేసారి ఇద్దరూ కూడా నియోజకవర్గాన్ని పట్టించుకోకపోవడం.. మరోవైపు ఎన్నికలు దగ్గర పడుతుండటం పార్టీ క్యాడర్లో అయోమయం నెలకొంది.

### బీసీ బిడ్డనైన నేను

## బి ఆర్ ఎస్ పార్టీలో ఇముడ లేను

**- ఏఎంసీ డైరెక్టర్ అనవేన వేణు**



**కమాన్ పూర్ – ప్రభాత సూర్యుడు :** బీసీ బిడ్డనైన నేను బిఆర్ఎస్ పార్టీలో ఇముడా లేనని పార్టీలో ఉండలేనని కమాన్ పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంచికలపేట గ్రామానికి చెందిన అనావేన వేణు స్పష్టం చేశారు. సోమవారం కమాన్ పూర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... బిఆర్ స్ పార్టీవారు తమ ఇంటిపై దాడి చేసి కొట్టిన జడ్పీ చైర్మన్ పుట్ట మధు కు స్థానిక బిఆర్ స్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కిషన్ రెడ్డి కి విన్నవించిన ఏమాత్రం పట్టించుకోలేదని అన్నారు. పుట్ట మధు బీసీలు బీసీలు అంటూనే బీసీల పైన దాడి చేసిన పట్టించుకోకపోవడంతో మనస్థాపానికి గురై బి ఆర్ ఎస్ మరియు ఏఎంసి డైరెక్టర్ కు రాజీనామా చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. తమ రాజీనామా లేఖను పార్టీ అధిష్టానానికి మరియు ఏఎంసీ డైరెక్టర్ పదవి రాజీనామాను వ్యవసాయ మార్కెట్ అధికారులకు పంపించడం జరుగుతుందని అన్నారు.తమకు విలువ ఇవ్వని పార్టీలో ఇక ఉండలేనని పేర్కొన్నారు. త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరతానాన్ని అన్నారు. ఆయనతోపాటు అనవేన మల్లేష్ గడ్డం నాగేష్ సైతం బి ఆర్ ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## రెసిడెన్షియల్ స్కూల కాంట్రాక్టు పోస్టుల భర్తీలో అవకతవకలు

**- బీజేవైఎం ఆరోపణ**

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :** రాష్ట్రంలో కేజీబీవీ , అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ లలో కాంట్రాక్టు పోస్టుల భర్తీ ప్రక్రియలో అవకతవకలు జరిగాయని భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాశ్ ఆరోపించారు. ఈ నియామక ప్రక్రియపై విచారణ జరిపించాలని లక్డికాపుల్ లోని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో విద్యాశాఖ కార్యదర్శికు మోమోరాండం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యాశాఖ అధికారులు తమకు ముడుపులు అందించిన వారికే పోస్టులు ఇచ్చారని... లక్షల్లో డబ్బులు చేతులు మారాయని ఆయన ఆరోపించారు. సెలవు రోజున ఈ పోస్టుల ఫైనల్ లిస్ట్ పెట్టి , జాయినింగ్ ఆర్డర్స్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. వీరి చర్యల వల్ల మెరిట్ అభ్యర్థులు ఉద్యోగాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపిక చేసిన భర్తీ ప్రక్రియను రద్దు చేసి , నిష్పక్షపాతంగా నియామకాలు చేపట్టాలని భానుప్రకాష్ డిమాండ్ చేశారు.

## జింక మాంసం స్వాధీనం..ముగ్గురు అరెస్టు




**రంగారెడ్డి - ప్రభాత సూర్యుడు :** రంగారెడ్డి శంషాబాద్ పరిధిలోని గగన్ పహాడ్ వద్ద ఎస్వోటీ పోలీసులు దాడులు నిర్వహించారు. జింక, దుప్పి మాంసాన్ని విక్రయిస్తుండగా ముగ్గురిని శంషాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వెంకటేష్, శ్రీను, పులి కరుణాకర్ అనే ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రెండు కిలోల జింక మాంసం, 14 కిలోల దుప్పి మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను శంషాబాద్ ఆర్జీఐఏ పోలీసులకు అప్పగించారు. వన్యప్రాణుల చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నిరుపేదల అభివృద్ధే సీఎం కేసీఆర్ లక్ష్యం

**- ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి**

**పెద్దపల్లి - ప్రభాత సూర్యుడు :** అణగారిన వర్గాలైన బీసీ, నిరుపేదల అభివృద్ధి, సంక్షేమం కోసమే సీఎం కేసీఆర్ బీసీ బంధు ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్స్ లో 300 మంది బీసీ కులవృత్తి లబ్ధిదారులకు బీసీ బంధు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన బీసీలందరికీ రూ.లక్ష సాయం అందుతుందన్నారు. మొదటి విడతగా నియోజకవర్గానికి 300 మందికి అందిస్తున్నామని, విడతల వారీగా అందరికీ చెక్కులు అందిస్తామ న్నారు. ప్రభుత్వం అందించే పథకాలన్నీ ప్రజలకు చేరడంతోనే ప్రజలందరూ బీఆర్ఎస్ పార్టీ వైపు ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమ న్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ బంధు పథకం కులవృత్తులకు ఎంతో ఉపయోగపడు తుంద న్నారు. నిరంతరంగా బీసీలకు సాయం అందు తుందన్నారు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన జెడ్పిటిసిలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, మార్కెట్ చైర్మన్, సింగిల్ విండో చైర్మన్లు, రైతు సమన్వయ సమితి నాయకులు, భారత రాష్ట్ర సమితి నాయకులు, కార్యకర్తలతో పాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.



### ప్రతి విద్యార్థి ఉన్నతంగా

# చదువుకుని ఆకాశమే హద్దుగా ఎదుగాలే

- -పేద బిడ్డల చదువు ఆర్థికబారం కావద్దన్నదే మా ఆలోచన
- -తలరాతలు మార్చే ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి
- -బీఆర్ఎస్ ప్రభుత్వంలో విద్యా వైద్య రంగాలకు ' ఎద్దపీట
- - జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్




**మంథని – ప్రభాత సూర్యుడు :** ప్రతి విద్యార్థి ఉన్నతంగా చదువుకుని ఆకాశమే హద్దుగా ఎదుగాలన్నదే తమ ఆకాంక్ష అని మంథని మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. సోమవారం మంథని పట్టణంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చదుకుంటున్న విద్యార్థులకు పుట్ట లింగమ్మ ట్రస్టు ద్వారా బస్సు పాస్లను మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేదింటి బిడ్డల చదువులు తల్లి దండ్రులకు ఆర్థికబారం కావద్దన్నదే మా ఆలోచన అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఎంతో మంది పేద బిడ్డలు ఆర్థిక స్థోమత లేక చదువులకు దూరం అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకోవాలనే తపన, ఆరాటం, ఆకాంక్ష ఉన్నా ఆర్థిక పరిస్థితులు వారి భవిష్యత్కు అడ్డుపడు తున్నాయని, అలాంటి పరిస్థితులు ఏ బిడ్డికు రావద్దన్నది ఆలోచన చేస్తున్నామని, ఇప్పటికే ప్రభుత్వ కళాశాలల్లో చదువుకునే పేద బిడ్డల ఆకలి తీర్చేలా మధ్యాహ్న బోజనం, ట్యూషన్ ఫీజు ఇతరత్రా సేవలు అందించామని ఆయన గుర్తు చేశారు. ప్రతి విద్యార్థి ఉన్నతంగా చదువుకుని ఆకాశమే హద్దుగా ఎదుగాలన్నదే తమ ఆకాంక్ష అని, ఈ క్రమంలో రాబోయే రోజుల్లో హైదరాబాద్లో ఉన్నత చదువులు చదువుకునే పేద విద్యార్థులకు హస్టల్ వసతి కల్పించే ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వివరించారు. అనేక ఏండ్లు ఈ ప్రాంతాన్ని పరిపాలన చేసిన పాలకులు ఏనాడు పేద బిడ్డల భవిష్యత్ గురించి ఆలోచన చేయలేదన్నారు. పాలకులు ఉన్నత చదువులు చదువుకున్నా గొప్పగా ఆలోచన చేయలేదన్నారు. గత పాలకుల స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు నేటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన మన ఊరు మన బడి కార్యక్రమంలో నిధులు కేటాయించి సున్నాలు వేసే వరకు వాళ్లు పట్టించుకోలేదని, అలాంటి దుస్థితి మన ప్రాంతంలో ఉండేదన్నారు. విద్యార్థి దశలోనే ప్రతి విషయాన్ని అవగతం చేసుకుని చర్చించుకోవాలని, తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించి చైతన్యం తీసుకురావాలన్నారు. మన తల రాతలు మార్చేది కేవలం ఓటుహక్కు మాత్రమేనని, ఆ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవడంలో ప్రతి ఒక్కరు అవగాహన పెంచు కోవాలన్నారు. మంచి నాయకుడిని ఎన్నుకుంటే మన భవిష్యత్కు బంగారు బాటలు వేస్తారని అన్నారు. ఈ ప్రాంతానికి, ఈ మట్టి గడ్డపై పుట్టిన వారు మాత్రమే మన గురించి ఆలోచన చేస్తారని, ముత్తారం మండలానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి కేకే రెడ్డి గొప్పగా ఆలోచన చేసి పేద బిడ్డలకు బస్పాస్లు ఇప్పించాలని తనతో చెప్పారని, ఏదైనా పని చెప్పితే చేస్తారనే నమ్మకం ఉండాలని, అలాంటి నమ్మకం తనపై ఉంచడం సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రాంతానికి చెందిన కేకే రెడ్డి ఆలోచన చేసినట్లుగా గత పాలకులు ఏనాడు ఆలోచన చేయలేదని, అలా చేసి ఉంటే మన భవిష్యత్ మరోలా ఉండేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా వైద్య రంగాలకు పెద్దపీట వేశారని, విద్యా వైద్య రంగాల్లో అనేక మార్పులు వచ్చాయని ఆయన గుర్తు చేశారు. కానీ పాలకుల తీరుతోనే కొంత ఇబ్బందులు తప్పడం లేదని, అలాంటి పరిస్థితులు రాకుండా తల్లి దండ్రులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మీపై ఉందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులకు ఉచిత బస్పాస్లను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అరెపల్లి కుమార్, ఎంపీపీ కొండా శంకర్, మండల విద్యాధికారి దాసరి లక్ష్మి, కౌన్సిలర్లు వీకే రవి, గద్రెపల్లి సత్యనారాయణ, కుర్ర లింగయ్య నాయకులు కొట్టే రమేష్, నక్క శంకర్ లతో పాటు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తృటిలో తప్పిన పెను ప్రమాదం

**యాదాద్రి – ప్రభాత సూర్యుడు :** యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం ధర్మోజి గూడెం గ్రామ జాతీయ రహదారిపై కారు సడెన్ బ్రేక్ వేయడంతో వెనక నుండి వస్తున్న లారీ అదుపు తప్పి ఢీ కొట్టడంతో కారు పల్టీ కొట్టింది. ఘటనలో కారులో ఉన్న నలుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రి తరలించారు. ప్రమాదం నేపథ్యంలో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని ట్రాఫిక్ ను నియంత్రించారు. బాధితులు నల్గొండ జిల్లా గుండ్లపల్లి వాసులుగా గుర్తించారుర

## నిర్మల్ డిపో మేనేజరు గా ప్రతిమరెడ్డి



**నిర్మల్ – ప్రభాత సూర్యుడు :** ఆర్టీసీ నిర్మల్ డిపో మేనేజర్గా ప్రతిమరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో భూపాలపల్లి డిపో మేనేజర్గా పనిచేశారు. ప్రస్తుతం డిపో మేనేజర్గా పనిచేస్తున్న ఎన్. సాయన్న నిజామాబాద్-2 డిపో కు బదిలీ పై వెళ్లారు.

## ఓపెన్ జిమ్ వ్యాయామ పరికరాలు పునరుద్దరించాలి

**-బీజేపీ నాయకుడు ముప్పిడి శ్రీధర్**



**వేములవాడ – ప్రభాత సూర్యుడు :** పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ లో వ్యాయామ పరికరాలను పునరుద్దరించాలని బీజేపీ నాయకుడు ముప్పిడి శ్రీధర్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత నాలుగు ఏళ్ల కిందట నెలకొల్పిన ఓపెన్ జిమ్ లో పరికరాలకు బేరింగులు పోవడంతో ప్రజలకు అసౌకర్యంగా ఉన్నాయని తెలిపారు. దీంతో వ్యాయామం చేసే సమయంలో ప్రజలు గాయాల పాలవుతున్నారని అన్నారు. సంక్రమంగా లేని పరికారాలతో వ్యాయామం చేయడం వల్ల అనేక ఇబ్బందులు పడాల్సివస్తుందని తెలిపారు. దీనిపై గతంలో పనిచేసిన మునిసిపల్ కమిషనర్, ప్రస్తుతం పనిచేస్తున్న కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, అయినప్పటికీ ఓపెన్ జిమ్ లో ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా ఓపెన్ జిమ్ లో వ్యాయామ పరికరాయాలను యధాస్థితిగా పునరుద్దరించాలని కోరారు.

## రూ 8.5 కోట్లు చేతివాటం చూపించిన బ్యాంక్ మేనేజర్

**నర్సంపేట – ప్రభాత సూర్యుడు :** వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని ఐసిఐసిఐ బ్యాంకు డిప్యూటీ మేనేజర్ చేతివాటం చూపించాడు. పని చేస్తున్న బ్యాంకు ను బురిడి కొట్టించి సుమారు రూ. 8.5 కోట్లు కొల్లగొట్టినట్లు తెలిసింది. ఖాతాదారులపేరిట బంగారం రుణాలు పొందినట్లు ఆడిటింగ్ లో బయట పడిన వైనం ఇది. ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు లేవని పోలీస్ అధికారులు అంటున్నారు. దాంతో డిప్యూటి మేనేజర్ బైరిశెట్టి కార్తీక్ పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### కళాకారులకు

## ప్రభుత్వ గుర్తింపు కార్డులను అందజేయాలి

**- జిల్లా సాంస్కృతిక కళాసంస్థ సమాఖ్య ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి**



**వేములవాడ – ప్రభాత సూర్యుడు :** రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతిని సోమవారం జిల్లా సాంస్కృతిక కళా సంస్థల సమాఖ్య కళాకారులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కళాకారులందరికీ ప్రభుత్వ గుర్తింపు కార్డులను అంద జేయాలని, అర్హులైన వృద్ధకళాకారుల నుండి కొత్తగా వృద్ధాప్యపింఛన్లను ధరఖాస్తులను స్వీకరించి, వృద్ధ కళాకారులకు పింఛన్లను మంజూరు చేయాలని కోరారు. హెల్త్ కార్డులను, బస్సుపాసులను, ప్రమాదబీమా సౌకర్యమును కల్పించి, కళాకారుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. తెలంగాణరాష్ట్రం సాధించేవరకు అనేక ఉద్యమ ధూమ్ ధాం కార్యక్రమాలలో పాల్గొన్న ఉద్యమకళాకారులను ప్రభుత్వం గుర్తించి, అర్హులైన వారికి నెలకు 20వేల రూపాయల గౌరవ వేతనం చెల్లించి, కళాకారులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాసంస్థల వ్యవస్థాపకఅధ్యక్షులు యెల్ల పోశెట్టి, సమాఖ్య గౌరవ అధ్యక్షులు బొడ్డురాములు, జిల్లా అధ్యక్షులు సావనపెల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వారాలదేవయ్య, కోశాధికారి బుర్రిశంకరయ్య, ప్రెస్ మీడియా కార్యదర్శి బొడ్డు నారాయణ, ఎండి ముస్తఫా, గుమ్మడి రాజేశంగౌడ్, మానువాడ లక్ష్మినారాయణ, బిల్లా వెంకట నరసయ్య, గడిగంటిచంద్రయ్య, ఆడెపు చందు, లింగాల రాజిరెడ్డి డొంగరి లక్ష్మిరాజం, పెండ్యాల బాల్ రెడ్డి, గుర్రం లక్ష్మినారాయణ గౌడ్, చొక్కి లచ్చయ్య, కముటం రాజేశ్వర్, గోగుల రాములు తదితర కళాకారులు పాల్గొన్నారు.

## మంత్రి కేటీఆర్ అడ్డుకున్న కాంగ్రెస్ నేతలు

**కామారెడ్డి – ప్రభాత సూర్యుడు :** సోమవారం నాడు కామారెడ్డి చేరుకున్న మంత్రి కేటీఆర్ కు నర్సన్నపల్లి బైపాస్ వద్ద ఘనస్వాగతం లభించింది. న స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ తదితరులు అయనకు స్వాగతం పలికారు. ముందుగా మంత్రి కేటీఆర్ మున్సిపల్ స్వాగత తోరణాన్ని ప్రారంభించారు. హౌసింగ్ బోర్డు, ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద ఏర్పాటు చేసిన పైలాన్ ను ల ఆవిష్కరించారు. మంత్రికి బీఆర్ఎస్ శ్రేణులు బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. అంతకు ముందు మంత్రి కేటీఆర్కు నిరసన సెగ తగిలింది. కామారెడ్డి జిల్లా దేవునుపల్లి వద్ద ఆయన కాన్వాయ్ను కాంగ్రెస్ నేతలు అడ్డుకున్నారు. మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు వారిపై లాఠీచార్జి చేసి అదుపులోకి తీసుకున్నారు. దీంతో కొంతసేపు అక్కడ గందరగోళం ఏర్పడింది.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215